ఇక్కడ సభ పెడితే గ్రాండ్ సక్సెస్

చిత్తారమ్మ ఆలయ ప్రాంతం... ఎన్నికల ప్రచార సభలకు కేంద్రం

- రాజకీయ పార్టీల ప్రచార సభలకు ఈ ప్రాంతమే ఫస్ట్ చాయిస్
- పార్టీల అధినేతలను తీసుకొచ్చి సభలు నిర్వహిస్తున్న స్థానిక నాయకత్వం
- ఇక్కడ ఏ పార్టీ సభ పెట్టినా పెద్ద సంఖ్యలో హాజరవుతున్న స్థానికులు





మూసాపేట: ఎన్నికల ప్రచారం.. ఎన్నికల పాదయాత్ర ముగింపు.. విజయోత్సవ సభలకు అడ్డాగా మూసాపేటలోని చిత్తారమ్మ టెంపుల్ ప్రాంతానికి ప్రత్యేకమైన పేరు ఉంది. ఇక్కడ సభలు నిర్వహిస్తే విజయవంతం అవుతుందనే సెంటిమెంట్ రాజకీయ పార్టీలకు ఉంది. ఎక్కడ సభ నిర్వహించినా ప్రజలను తరలించాల్సిన పరిస్థితి రాజకీయ పార్టీలకు ఉంటుంది. కానీ ఈ ప్రాంతంలో ఏ సభ నిర్వహించినా.. ఏ సమావేశం పెట్టినా ప్రజలు అధిక సంఖ్యలో రావడం విశేషం. అందుకే ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మాజీ మంత్రి కేటీఆర్, బీజేపీ కేంద్ర నాయకులు ఎందరో ఇక్కడ సభలు,సమావేశాలు నిర్వహించారు.

ఈ ప్రాంతం సభలకు ఎందుకు సెంటిమెంట్‌గా మారింది.?

మూసాపేటలోని చిత్తారమ్మ ఆలయ పరిసరాల్లో నిత్యం మినీ మార్కెట్ జరుగుతూ ఉంటుంది. రోడ్లపై చిరు వ్యాపారులు కూడా వివిధ రకాల వ్యాపారాలు, ఫుడ్ స్టాల్స్ కొనసాగుతాయి. మూసాపేటలో ప్రజలు సాయంత్రం 6గంటలు దాటిందంటే కొనుగోళ్లకు వస్తూ సందడి చేస్తుంటారు. దీంతో ఈ ప్రాంతం ఎప్పుడూ రద్దీగా ఉంటుంది. అంతేకాకుండా మూసాపేటలో వివిధ రాష్ట్రాలు, ప్రాంతాల నుంచి వలస వచ్చిన ప్రజలు ఎక్కువగా నివసిస్తుంటారు. ఈ ప్రాంతంలో సభలు నిర్వహించినప్పుడు ఇక్కడికి వచ్చే వారు సైతం పాల్గొని విజయవంతం చేస్తారు.

మినీ ఇండియాగా మూసాపేట..

బీహార్, ఒరిస్సా, శ్రీకాకుళం, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర, తెలంగాణలోని ఇతర ప్రాంతాల నుంచి ప్రజలు వలస వచ్చి ఇక్కడ నివసిస్తుంటారు. ఒక రకంగా చెప్పాలంటే మూసాపేట మినీ ఇండియాగా తలపిస్తుంది. గూడ్స్‌షెడ్ రోడ్డులోని వివిధ రాష్ట్రాల నుంచి వచ్చే గూడ్స్ రైళ్ల నుంచి గోధుమలు, ఉప్పు, చెక్కర, యూరియా వంటి వాటిని ఎగుమతి, దిగుమతి జరుగుతూ ఉండటంతో హమాలీ కార్మికులు ఎక్కువగా పనిచేస్తుంటారు.

◆ అంతేకాకుండా ప్రశాంత్‌నగర్, బాలానగర్ ప్రాంతాల్లో పరిశ్రమలు ఎక్కువగా ఉండటంతో కార్మికులుగా పనిచేస్తుంటారు. మేస్త్రీ, కూలీ పనులు ఎక్కువగా జరుగుతుండటంతో ఈప్రాంతంలో జనాభా ఎక్కువగా ఉంటుంది. ఉదయం నుంచి సాయంత్రం వరకు తమ పనులు ముగించుకొని కూరగాయలు, నిత్యావసరలు, ఇతర సామగ్రి కొనుగోలు కోసం ఈ ప్రాంతానికి అధికంగా వస్తూ ఉంటారు. ఆదివారమైతే ఈ ప్రాంతంలో రద్దీ ఎక్కువగా ఉంటుంది.



ఇక్కడ ఏ పార్టీ సమావేశమైనా గ్రాండ్ సక్సెస్..

రాజకీయ పార్టీల సభలు జరిగినప్పుడు నేతలను చూడటానికి.. వారి ప్రసంగాలు వినడానికి ఇక్కడి ప్రజలు ఆసక్తి చూపిస్తారు. దీంతో ఈ ప్రాంతంలో ఏ పార్టీ సమావేశమైనా గ్రాండ్ సక్సెస్ అవుతుంది. ఆదివారమైతే ఆ సభలో జనాలు కిక్కిరిసిపోయి కనిపిస్తుంటారు. జనాలను తరలించకుండానే స్వచ్ఛందంగా అధిక సంఖ్యలో వస్తారు. తక్కువ ఖర్చుతో తమ సమావేశం, సభలు విజయవంతం కావాలంటే మూసాపేటలోని చిత్తారమ్మ ఆలయం ప్రాంతాన్నే ప్రథమంగా ఎంచుకుంటారు. ప్రతి ఎన్నికల్లో, ప్రతి పార్టీ ఖచ్చితంగా తమ ప్రధాన నాయకులను ఈ ప్రాంతానికి తీసుకువచ్చి సభలు ఏర్పాటు చేస్తుండటం విశేషం.

ఆక్వాటన్నెల్ ఎగ్జిబిషన్ షురూ



ఎగ్జిబిషన్ వివరాలను వెల్లడిస్తున్న నిర్వాహకులు రాజశేఖర్‌రెడ్డి స్కూబా డైవింగ్ చేస్తున్న వ్యక్తి

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి ట్రక్ పార్కింగ్‌లో ఏర్పాటు చేసిన ఆక్వా టన్నెల్ ఎగ్జిబిషన్ ఆదివారం ప్రారంభమైందని నిర్వాహకులు రాజశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. మొట్టమొదటి సారిగా హైదరాబాద్ నగరవాసులకు, వేసవి సెలవుల్లో చిన్నారులకు 60 రోజుల పాట అండర్ వాటర్ టన్నెల్ ఎక్స్‌పో స్కూబా డైవింగ్ అలరించనుందన్నారు. ఇందులో 600 రకాలకు పైగా చేపలు, స్టార్ ఫిష్, గోల్డ్ ఫిష్, ఎలక్ట్రిక్ ఈల్, అమెజాన్ నదిలో మాత్రమే లభించే అలిగేటర్ ఫిష్ వంటి ఎన్నో రక రకాల చేపలు, ఇతర సముద్ర జీవాలు సందర్శకులను ఎంతగానో ఆకట్టుకుంటాయన్నారు. అదే విధంగా చిన్న పెద్దలు ఆనందించేలా స్కూబా డైవింగ్, షాపింగ్, అమ్యూజ్‌మెంట్ పార్కు, ఫుడ్ కోర్టు, దేశంలోని అన్ని రాష్ట్రాల హ్యాండిక్రాఫ్ట్ చేనేత ప్రత్యేక వస్తువులు ఈ ఎగ్జిబిషన్‌లో ప్రత్యేకం అన్నారు. స్కూబా డ్రైవ్ చేయాలనుకునేవారు ఉదయం 8 నుంచి 11 గంటల వరకు వచ్చి నిర్వాహకులను సంప్రదించాలని రాజశేఖర్ రెడ్డి తెలిపారు.

కారు గుర్తుపై ఓటు వేద్దాం

ఆల్విన్‌కాలనీ: చేవెళ్ల లోక్‌సభ బీఆర్ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌కు మద్దతుగా ఆదివారం మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు, డివిజన్ అధ్యక్షుడు సంజీవరెడ్డి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా గొట్టిముక్కల పెద్ద భాస్కర్‌రావు స్థానిక నాయకులు, కార్యకర్తలతో కలిసి వెంకటేశ్వరనగర్‌లో గడపగడపకు వెళ్లి కరపత్రం అందజేశారు. కారు గుర్తుకు ఓటు వేసి కాసాని జ్ఞానేశ్వర్‌ను అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

దుస్తుల పంపిణీ

కూకట్‌పల్లి: హెల్పింగ్ హ్యూమన్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ట్రస్ట్ చైర్మన్ షేక్ మమహ్మద్ మగ్బూల్ జీహెచ్ఎంసీ కార్మికులకు ఆదివారం దుస్తులు పంపిణీ చేశారు. భరత్‌నగర్ కాలనీలో 100 మంది మహిళలకు చీరలు, 25 మంది పురుషులకు ప్యాంటు, షర్టులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరం తమ ట్రస్ట్ ద్వారా ఎంతోమందికి ఉచితంగా దుస్తులు, ఆహారం అందజేస్తున్నామని పేర్కొన్నారు. నిత్యం ప్రజలకు సేవ చేస్తున్న జీహెచ్ఎంసీ కార్మికులకు దుస్తులు పంపిణీ చేసి వారిని సన్మానించుకోవటం ఆనందంగా ఉందన్నారు.

బీజేపీ, బీఆర్‌ఎస్ తోడుదొంగల పార్టీలు



కూకట్‌పల్లిలో ప్రచారంలో పాల్గొన్న అభ్యర్థి సునీతామహేందర్‌రెడ్డి, బండి రమేష్, కార్యకర్తలు

కూకట్‌పల్లి: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో కూకట్‌పల్లిలో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రచారాన్ని హోరెత్తించింది. మల్కాజిగిరి లోక్‌సభ పార్టీ అభ్యర్థి సునీతామహేందర్‌రెడ్డి, కూకట్‌పల్లి ఇన్‌చార్జి బండి రమేష్, మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు హరివర్ధన్‌రెడ్డి, కూకట్‌పల్లి కోఆర్డినేటర్ వినయ్ రెడ్డి ఆదివారం కూకట్‌పల్లి నియోజకవర్గంలో ఇంటింటికీ వెళ్లి ఓటర్లను కలిశారు. హస్తం గుర్తుకు ఓటేసి గెలిపించాలని అభ్యర్థించారు.

◆ ఈ సందర్భంగా సునీతా మాట్లాడుతూ... మల్కాజిగిరిలో లక్ష ఓట్ల మెజార్టీతో తాను గెలుస్తానని ధీమా వ్యక్తం చేశారు. బీఆర్‌ఎస్, బీజేపీ రెండు తోడు దొంగల పార్టీలని విమర్శించారు. ఆ రెండు పార్టీలు వ్యవహరిస్తున్న తీరుపై ఆమె మండిపడ్డారు. తనను గెలిపిస్తే 24 గంటలు ప్రజలకు అందుబాటులో ఉంటానన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా కూకట్‌పల్లి డివిజన్ పార్టీ కార్యాలయాన్ని ఆమె ప్రారంభించారు. అనంతరం రెయిన్‌టో విస్టాస్‌లో ఓటర్లను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

◆ ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ.. రాష్ట్రంలోనూ, కేంద్రంలోనూ ఒకే పార్టీ ఉంటే అభివృద్ధికి అధిక నిధులు తెచ్చుకోవచ్చని అన్నారు. లోక్‌సభ ఎన్నికల అనంతరం స్థానిక సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కల్వరి టెంపుల్, చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సత్యం శ్రీరంగం, నాగిరెడ్డి, తూము వేణు, గొట్టిముక్కల దేశాల్, గొట్టిముక్కల వెంకటేశ్వరరావు, మొలుగు భీమ్‌రావు, శేరి సతీష్‌రెడ్డి, పుష్పరెడ్డి, ప్రవీణ్, మేకల రమేష్, ఎండీ మొయిజ్ తదితరులు పాల్గొన్నారు.

అపార్టుమెంట్ వాసులను కలిసిన నాయకులు

ప్రచారంలో భాగంగా కేపీహెచ్‌బీలోని పలు అపార్టుమెంట్ వాసులను కాంగ్రెస్ నాయకులు కలిశారు. లోక్‌సభ ఎన్నికల్లో మల్కాజిగిరి ఎంపీగా సునీతామహేందర్‌రెడ్డిని గెలిపించాలని అభ్యర్థించారు.

బాలాజీనగర్ డివిజన్ పార్టీ కార్యాలయం ప్రారంభం...

యువజన కాంగ్రెస్ కూకట్‌పల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి జిట్టా సునీల్‌కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో బాలాజీనగర్ డివిజన్ మూసాపేట పరిధిలోని ప్రగతినగర్ రోడ్ నం.7లో పార్టీ కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి, హరివర్ధన్‌రెడ్డి, బండి రమేష్, కోటంరెడ్డి వినయ్‌రెడ్డి హాజరై కార్యాలయాన్ని ప్రారంభించారు.

అనుమానాస్పదస్థితిలో వ్యక్తి మృతి

కేపీహెచ్‌బీకాలనీ: అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ప్రకాశం జిల్లాకు చెందిన హరినారాయణ హ్యాపీహోమ్స్ పీజీ హాస్టల్స్‌లో ఉంటూ రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తాంటాడు. అయితే 26వ తేదీ సాయంత్రం అపస్మారకస్థితిలో ఉన్న హరినారాయణను ముగ్గురు వ్యక్తులు హాస్టల్ వద్దకు బైక్‌పై తీసుకు వచ్చి కింద పడేశారు. వెంటనే అతడిని సూరారంలోని మల్లారెడ్డి ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ 27 రాత్రి మృతి చెందాడు. హరినారాయణ అతని స్నేహితులు అంజిరెడ్డి, రవితో కలిసి ప్రగతినగర్‌లో మద్యం సేవించారు.

◆ వీరందరిది ప్రకాశం జిల్లా వాసులే. వ్యాపారం, వ్యక్తిగత విషయాలపై హరినారాయణ, అంజిరెడ్డి మధ్య వాగ్వాదం జరిగింది. దీంతో గొడవ పడి హరినారాయణను అంజిరెడ్డి కొట్టడంతో తలకు తీవ్ర గాయమైంది. అంజిరెడ్డి స్నేహితుడు రవి ఇరువురిని నచ్చచెప్పే ప్రయత్నం చేశాడు. అనంతరం తలకు తీవ్ర గాయమైన హరినారాయణను హాస్టల్ వద్ద కింద పడవేసి వెళ్లిపోయారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ అంజిరెడ్డి మృతి చెందాడు. ఈ మేరకు ఆయన సోదరి హనుమాయమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రికి తరలించి, సెక్షన్ 324ను 302 సెక్షన్‌గా మార్చి విచారణ చేపట్టారు. అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మల్కాజ్‌గిరి ఎంపీగా రాగిడి లక్ష్మారెడ్డి విజయం తథ్యం



కేపీహెచ్‌బీ డివిజన్‌లో ప్రచారం చేస్తున్న కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు, కార్యకర్తలు

కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు

కూకట్‌పల్లి: మల్కాజిగిరి లోక్‌సభ బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి గెలుపే లక్ష్యంగా ప్రచారం చేస్తున్నామని కేపీహెచ్‌బీ కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు అన్నారు. కేపీహెచ్‌బీ డివిజన్‌లోని 4, 7వ ఫేజుల్లో ఇంటింటికీ వెళ్లి కారు గుర్తుకు ఓటు వేసి రాగిడి లక్ష్మారెడ్డిని గెలిపించాలని అభ్యర్థించారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పట్ల ప్రజలు పూర్తి విశ్వాసంతో ఉన్నారన్నారు. కేపీహెచ్‌బీ డివిజన్ నుంచి రాగిడి లక్ష్మారెడ్డికి భారీ మెజార్టీ తీసుకొచ్చే బాధ్యత తమదన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, సాయిబాబా చౌదరి, రాజేష్, పాతూరి గోపి, సాయి శ్రీనివాస్, కట్టా నరసింగరావు తదితరులు పాల్గొన్నారు.

దొంగ హామీలతో వంచించారు: శ్రావణ్‌కుమార్

మూసాపేట: కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆదేశాల మేరకు ఆదివారం మూసాపేట డివిజన్‌లోని అంబేద్కర్‌నగర్, బాబు జగ్జీవన్‌రామ్‌నగర్‌లో మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్‌కుమార్ ప్రచారం నిర్వహించారు. డివిజన్ అధ్యక్షుడు అంబటి శ్రీనివాస్, నాయకులతో ఇంటింటికీ వెళ్లి కాంగ్రెస్ వైఫల్యాలను వివరించారు. దొంగ హామీలతో ప్రజలను వంచించిన విషయాలను ప్రజలకు అర్థమయ్యేలా వివరించారు. బీఆర్ఎస్‌కు ఓటు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు సప్పిడి శ్రీనివాస్, తుకారాం, విష్ణు, రాజు, రవిసింగ్, ఈశ్వర్, రాము, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.



బాలాజీనగర్ డివిజన్‌లో నాయకులతో కలిసి ప్రచారం చేస్తున్న కార్పొరేటర్ శిరీష

లక్ష్మారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలి: కార్పొరేటర్ శిరీష

బాలాజీనగర్ డివిజన్‌లోని హమీద్‌గనర్, ఆంజనేయనగర్‌లలో ఆదివారం కార్పొరేటర్ పగుడాల శిరీష బాబూరావు ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ తిరుగుతూ రాగిడి లక్ష్మారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. బాలాజీనగర్ డివిజన్ ప్రజలు బీఆర్ఎస్ అభ్యర్థికే ఓటు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు సీహెచ్. ప్రభాకర్‌గౌడ్, కార్యదర్శి వెంకటేష్ చౌదరి, మహిళా అధ్యక్షురాలు అనితా శ్రీపాద, డివిజన్ మహిళా అధ్యక్షురాలు అరుణా శెట్టి నాయకులు హరినాథ్, ఖదీర్, యాదుల్, రషీద్, షరీఫ్, అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి పక్షాలు ఎన్ని కుట్రలు చేసినా బీజేపీదే గెలుపు

మోతీనగర్: దేశాన్ని పాలించే సత్తా ప్రధాని నరేంద్రమోదీకే ఉందని బీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్, బీజేపీ సీనియర్ నాయకుడు తాడూరు శ్రీనివాస్ పేర్కొన్నారు. ఆదివారం బీజేపీ నాయకులు ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రతి ఒక్కరూ బీజేపీకి ఓటు వేసే విధంగా మోదీ చేసిన అభివృద్ధి పనులు, చేపట్టబోయే పనుల గురించి వివరిస్తూ ఓటు అడగాలని సూచించారు. నిరంతరం దేశ ప్రజల కోసం పరితపించే నాయకుడు మోదీ అని కొనియాడారు. ఆయన దేశానికి చేస్తున్న సేవలు అమోఘమని తెలిపారు. మూడోసారి మోదీయే ప్రధానమంత్రి కావటం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ప్రతిపక్ష పార్టీలు ఎన్ని కుట్రలు చేసినా మోదీ ముందు దిగదుడుపేనని పేర్కొన్నారు. ఆయనను కలిసిన వారిలో నార్లపురం శ్రీనివాస్, ఉప్పల దామోదర్ నేత, గోనెల సుదర్శన్ ముదిరాజ్, కె. శ్రీనివాస్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

చర్చిలో ఏపీ మంత్రి నాగార్జున ప్రార్థనలు



లార్డ్స్ గ్రేస్ మినిస్ట్రీస్ చర్చికి విచ్చేసిన మంత్రి మేరుగ నాగార్జునతో చర్చి ఫాదర్ జార్జి హెర్బెట్ తదితరులు

కూకట్‌పల్లి: కేపీహెచ్‌బీలోని లార్డ్స్ గ్రేస్ మినిస్ట్రీస్ చర్చికి ఆంధ్రప్రదేశ్ మంత్రి మేరుగ నాగార్జున ఆదివారం విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన చర్చికి వచ్చిన వారికి సందేశం అందించారు. ఈ సందర్భంగా పలువురితో ఆయన ముచ్చటించారు. అనంతరం చర్చిలో ఉన్న వారితో కొద్దిసేపు సందడి చేసి అనంతరం అక్కడ తేనీటి విందులో పాల్గొన్నారు. ఆయనతో పాటు చర్చి ఫాదర్ జార్జి హెర్బెట్, మేకల మైకేల్, తదితరులు పాల్గొన్నారు.

ఐరా స్టూడియోస్ ప్రారంభం

మోతీనగర్: మోతీనగర్‌లో శ్రావ్య మానస భోగిరెడ్డి సారథ్యంలోని సుమధుర డాన్స్ అకాడమీకి అనుబంధంగా ఏర్పాటు చేసిన ఐరా స్టూడియోస్‌ను ఆదివారం వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు ప్రారంభించారు. ఈ సందర్భంగా అకాడమీ విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాంశాలు ఆకట్టుకున్నాయి. కళలు, కళాకారులను ప్రోత్సహించాలన్న ముఖ్య ఉద్దేశంతో ఐరా స్టూడియోస్‌ని ప్రారంభించటం అభినందనీయమని అతిథులు పేర్కొన్నారు. అనంతరం రాష్ట్ర భాషా సంస్కృతిక శాఖ సంచాలకులు మామిడి హరికృష్ణ సంస్థ లోగోని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సినీ దర్శకుడు జేకే అన్వేషి ఫేమ్, టీటీడీఏయూ ప్రెసిడెంట్ ఆర్‌సీఎం రాజు, సెక్రటరీ వర్మ, సంగీత దర్శకులు నరేన్, ఫ్లూట్ రవికుమార్, జంబియర్స్ సిద్ధార్థ తదితరులు పాల్గొన్నారు.

ఆటోడ్రైవర్ కుమారుడికి అభినందనల వెల్లువ

కూకట్‌పల్లి: రెక్కాడితే కానీ డొక్కాడని ఓ నిరుపేద కుటుంబానికి సరస్వతి దేవీ కటాక్షం అందింది. మహబూబ్‌నగర్ జిల్లా బూత్‌పూర్ మండలి, కర్వేన గ్రామానికి చెందిన గోరిక కాశి నిజాంపేటలోని రాజీవ్‌గాంధీనగర్‌లో నివాసముంటూ ఆటో డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఆయన భార్య అంజమ్మ ఇళ్లలో పనిచేస్తుంది. వీరిద్దరు పనిచేస్తేనే వీరి ముగ్గురు పిల్లలు చదువులకు వెళుతున్నారు. ముగ్గురు పిల్లలను నగరంలో చదివించుకుంటూ జీవనం సాగిస్తున్న వీరికి ఆర్థికంగా ఎన్ని ఒడిదుడుకులు వచ్చినా బండిని లాక్కుంటూ వచ్చారు.

◆ ఇటీవల ఉచిత బస్సు సౌకర్యంతో ఆటో కూడా సంపూర్ణంగా నడవటం లేదని కాశి తెలిపారు. ఆయన పెద్ద కుమారుడైన గోరిక పాల్‌కు ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో 470 మార్కులుకు గాను 468 మార్కులు సాధించి రికార్డు సాధించాడు. కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డు కాలనీలోని ఓ కళాశాలలో విద్యనభ్యసిస్తున్న పాల్ ఉన్నత చదువులతో పాటు పలువురికి సేవ చేయాలనే దృక్పథంతో తన గోల్ నిర్ణయించుకున్నానని తెలిపాడు. ఎన్ని కష్టాలు వచ్చినా తన కుమారుడి పై చదువులు చదివిస్తానని పాల్ తల్లిదండ్రులు కాశి, అంజమ్మలు దృఢ సంకల్పంతో చెప్పారు.

పేరు ప్రకటించినప్పుడే ఈటల గెలుపు ఖరారైపోయింది

- కూకట్‌పల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి మాధవరం కాంతారావు
- ఫతేనగర్, బాలాజీనగర్‌లో డివిజన్లలో ఇంటింటికీ బీజేపీ ప్రచారం
- నేడు నిజాంపేట డివిజన్‌లో జేపీ నడ్డా రోడ్‌షో, బైక్ ర్యాలీ



ఫతేనగర్ డివిజన్‌లో ఇంటింటి ప్రచారంలో పాల్గొన్న మాధవరం కాంతారావు

కూకట్‌పల్లి: మల్కాజిగిరి లోక్‌సభ బీజేపీ అభ్యర్థిగా ఈటల రాజేందర్ పేరును బీజేపీ ఖరారు చేసిన రోజే ఆయన గెలుపు ఖరారైందని కూకట్‌పల్లి పార్టీ ఇన్‌చార్జి మాధవరం కాంతారావు అన్నారు. ఆదివారం ఫతేనగర్ డివిజన్‌లో నిర్వహించిన రెండో విడత ఇంటింటి బీజేపీ ప్రచారంలో ఆయన పాల్గొన్నారు. ముందుగా పండిత్ దీన్‌దయాల్ ఉపాధ్యాయ విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. అనంతరం పార్టీ శ్రేణులతో కలిసి ఇంటింటికీ ఎన్నికల ప్రచారంలో పాల్గొని మాట్లాడారు. అన్ని రంగాలకు చెందిన ప్రజలు బీజేపీకే మొగ్గు చూపుతున్నారని ఈసారి 400 సీట్లు పక్కాగా సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఉద్యమకారుడైన ఈటల రాజేందర్‌కే తమ మద్దతు ఉంటుందని ఓటర్లు చెబుతున్నారని తెలిపారు. దేశాభివృద్ధిలో మోదీతో కలిసి మనమంతా ప్రయాణం చేసి భారత్ విశ్వగురువు స్థానంలో నిలపాలను విజ్ఞప్తి చేశారు.

జేపీ నడ్డా రోడ్ షో విజయవంతం చేయండి...

రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో మల్కాజ్‌గిరి లోక్‌సభ బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ గెలుపే లక్ష్యంగా ప్రచార వేగాన్ని పెంచాలని మాధవరం కాంతారావు కార్యకర్తలకు సూచించారు. కూకట్‌పల్లి బీజేపీ కార్యాలయంలో డివిజన్ అధ్యక్షుడు వినోద్‌కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమీక్ష, సమావేశంలో కాంతారావు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈనెల 29న నిజాంపేట్ డివిజన్‌లో బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా రోడ్‌షో, బైక్ ర్యాలీ కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు. అదే విధంగా ఇంటింటి ఓటర్ వెరిఫికేషన్ ప్రక్రియను కొనసాగిస్తూ కమలం గుర్తుకు ఓటు వేసేలా అభ్యర్థించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు పద్మయ్య, శ్రీకర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

అవినీతి మచ్చలేని మనిషి ఈటల రాజేందర్..

కూకట్‌పల్లి నియోజకవర్గంలోని బాలాజీనగర్ డివిజన్‌లోని పలు కాలనీల్లో ఆదివారం 'ఘర్ ఘర్ పే బీజేపీ'కార్యక్రమంలో కూకట్‌పల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి మాధవరం కాంతారావుతో కలిసి బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రజలు అవినీతి మచ్చలేని ఈటల రాజేందర్‌కు ఓటు వేసి గెలిపించాలని కోరారు. అత్యధిక మెజార్టీ అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో బాలాజీనగర్ డివిజన్ అధ్యక్షుడు వినోద్, వివిధ శక్తి కేంద్ర ఇన్‌చార్జీలు, బూత్ అధ్యక్షులు, సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఈటల రాజేందర్‌ను గెలిపించుకుందాం పులిగొళ్ల శ్రీనివాస్‌యాదవ్

మోతీనగర్: మల్కాజ్‌గిరి బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్‌కు మద్దతుగా ఆదివారం అల్లాపూర్ డివిజన్‌లోని రాజీవ్‌గాంధీనగర్, సఫ్దార్‌నగర్, యూసుఫ్‌నగర్‌లలో బీజేపీ జిల్లా కార్యదర్శి పులిగొళ్ల శ్రీనివాస్ యాదవ్ ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి లోక్‌సభ ఎన్నికల్లో ఈటల రాజేందర్‌ను భారీ మెజార్టీతో గెలిపిస్తే మన డివిజన్‌ను ఎంతో అభివృద్ధి చేసుకోవచ్చన్నారు. అదే విధంగా పేదల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న బీజేపీకి ఈసారి ప్రజలు బ్రహ్మరథం పట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు పూజారాం, మామాజీ, రవి యాదవ్, జయ తదితరులు పాల్గొన్నారు.



బాలాజీనగర్ డివిజన్‌లో ప్రచారం



అల్లాపూర్ డివిజన్‌లో ప్రచారం

చిన్న పిల్లలకు ఉచిత మెగా వైద్య శిబిరం

ఆల్విన్‌కాలనీ: సమాజానికి సేవ చేయటంలో రామ్‌దేవ్‌రావు హాస్పిటల్ నిరంతరం కృషి చేస్తూనే ఉంటుంది. ఇందులో భాగంగా ఆదివారం చిన్న పిల్లలకు సంబంధించిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఇందులో చిన్న పిల్లలకు వచ్చే పలు సమస్యల గురించి, కాలానుగుణమైన వాతావరణంలో వచ్చే మార్పులు వల్ల వచ్చే వ్యాధుల గురించి అవగాహన కల్పించారు. హెచ్‌పీవీ వ్యాక్సిన్ గురించి 9 నుంచి 15 సంవత్సరాలలోపు పిల్లల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఈ క్యాంపులో రామ్‌దేవ్‌రావ్ హాస్పిటల్ మెడికల్ డైరెక్టర్ డా. కమలాకర్, పిల్లల వైద్య నిపుణురాలు డా. పి. భవాని దివ్య, డా. విజయానంద్‌ల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ శిబిరంలో సుమారు 600 మందికి వైద్య పరీక్షలు, కంటి పరీక్షలు చేశామని హాస్పిటల్ సీఈఓ డా. యోబు తెలిపారు.



వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న రామ్‌దేవ్‌రావ్ ఆసుపత్రి సీఈఓ డా. యోబు

వేదిక్ మ్యాథ్స్‌లో సత్తా చాటిన విద్యార్థులు



విశ్వం ఎడ్యుటెక్ అబాకస్, వేదిక్ మ్యాథ్స్ జాతీయ స్థాయి పోటీల్లో సత్తా చాటిన విద్యార్థులు, నిర్వాహకులు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి పీఎస్ఎం స్కూల్‌లో జరిగిన విశ్వం ఎడ్యుటెక్ అబాకస్, వేదిక్ మ్యాథ్స్ జాతీయ స్థాయి పోటీలు నిర్వహించారు. ఈ పోటీలు నాలుగు రాష్ట్రాల్లో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీలోల వెయ్యి మంది విద్యార్థులు పోటీలకు హాజరు కాగా 115 మంది జాతీయ స్థాయికి ఎంపిక అయ్యారు. ఆదివారం జరిగిన పోటీలో 28 మంది విద్యార్థులు విజయం సాధించారు. ఈ పోటీలో పాల్గొన్న విద్యార్థులకు యాజమాన్యం 5 లక్షల విలువైన స్కాలర్‌షిప్, బహుమతులను అందజేశారు. పోటీల్లో చాంపియన్‌గా నిలిచిన 14 మంది విద్యార్థులకు 14 మంది విద్యార్థులకు 5 వేలు, ఇతర బహుమతులు అందజేశారు. బెస్ట్ పెరఫార్మర్‌గా నిలిచిన 14 మంది విద్యార్థులకు 2 వేలు నగదు బహుమతి అందజేశారు. పోటీలో పాల్గొన్న వారందరికి కన్సోలేషన్ బహుమతులు అందజేశారు. విజేతలకు విశ్వం ఎడ్యుటెక్ సీఈఓ హరిచరణ్ బహుమతులు అందజేసి అభినందనలు తెలిపారు. జాతీయ స్థాయిలో విజయం సాధించిన 28 మంది విద్యార్థులు అక్టోబర్ 2024లో జరిగే అంతర్జాతీయ స్థాయిలో పాల్గొనటానికి అర్హత సాధించారని తెలిపారు.